క్లుప్తంగా

మణిపూర్ హింసకు మోదీ, షా కారకులు



ఆందోళన చేస్తున్న హమాలీలు

ఏలూరు రూరల్: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతోన్న హింస, దాడులకు ప్రధాని మోదీ, అమిత్ షా ప్రధాన కారకులని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు ఆరోపించారు. మణిపూర్ ఘటనలకు నిరసనగా ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మణిపూర్‌లో కుకీ, నాగ తదితర ఆదివాసీ మహిళలపై అత్యాచారం, క్రైస్తవ చర్చిలపై జరుగుతోన్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. మైతేయి, కుకీ, నాగాల మధ్య మోదీ – షా ద్వయం రాజకీయ లబ్ధి కోసం మత చిచ్చు రగలించిందని ఆరోపించారు. మైనారిటీలపై జరుగుతోన్న హత్య, దమకాండపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి ద్వారా విచారణ చేపట్టాలని కోరారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, దాడులను అడ్డుకోలేని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్రపతి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో సంఘం నాయకులు సింహాచలం, పండు, పద్మ, కొండమ్మ, దానియేలు, రాములమ్మ, సూర్యకుమారి పాల్గొన్నారు.

ఎస్సీల చెరువులను పునరుద్ధరించాలి



ఎంపీపీ శ్రీనివాసరాజును కలిసిన కొవ్వలి గ్రామస్తులు

ఏలూరు రూరల్: ఎస్సీలు సాగు చేసిన చేపల చెరువులను పునరుద్ధరించాలని కొవ్వలి గ్రామానికి చెందిన ఎస్సీలు ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజును కోరారు. పలువురు గ్రామస్తులు బుధవారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిశారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో బి ఫారం పట్టాలు అందుకుని చేపల చెరువులు సాగు చేసుకున్నామని ఎంపీపీకి వివరించారు. 2007లో అధికారులు చేపట్టిన కొల్లేరు ఆపరేషన్‌లో భాగంగా చెరువులు కొట్టేశారని చెప్పారు. నాటి నుంచీ ఇతర వృత్తులు, కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ అభయారణ్యంలో కొట్టేసిన చెరువుల పునరుద్ధరణ సాధ్యం కాదన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీల అభివృద్ధికి పంచాయతీ, మండల పరిషత్, ప్రభుత్వ నిధులు ఖర్చు చేస్తున్నారని వివరించారు. ఎమ్మెల్యేను కలిసి, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరాలని కోరు.

రోడ్లపై చేరిన వర్షపునీరు

ఏలూరు రూరల్: ఏలూరులో పూర్తిస్థాయిలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపునీరు రోడ్లపై చేరుతోందని, పారిశుధ్యం అధ్వానంగా మారుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు నడపన దాన భాస్కరరావు పేర్కొన్నారు. బుధవారం స్థాని శాంతినగర్, ఫిరంగులదిబ్బ, శనివారపుపేట విద్యానగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాలను సందర్శించామని, అధికారులు తక్షణం స్పందించి డ్రెయినేజీ వ్యవస్థ ను మెరుగుపరచాలని కోరారు. నాయకులు ముద్దాన్ని దుర్గారావు, ముద్దాని జ్యోతికుమార్, మేకల కృష్ణదేవరాయులు, చేకూరి గణపతి, ఇట్టాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరికి స్వాగతం

ఏలూరు రూరల్: కలపర్రు టోల్‌గేట్ వద్ద బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి పార్టీ ఏలూరు పార్లమెంటరీ కన్వీనర్ గారపాటి సీతారామాంజనేయచౌదరి స్వాగతం పలికారు. రాజమండ్రిలో బీజేపీ జోనల్ సమావేశంలో పాల్గొనేందుకు విజయవాడ నుంచి రాజమండ్రి వెళుతున్న పురందేశ్వరిని నాయకులు చిన్నం రామకోటయ్య, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సుధాకర్ కృష్ణ, కార్యదర్శి కృష్ణప్రసాద్, సత్యనారాయణ తదితరులు కలిసి గజమాల వేశారు. జిల్లాలో బీజేపీ పటిష్టతకు కృషి చేయాలని ఆమె సూచించారు.



ఏలూరు వెంకట్రామ రోడ్డు ఇలా



ఏలూరు పవరుపేట స్టేషన్ రోడ్డు



జలయమైన ఏలూరు వాసు ఆలయం రోడ్డు



ఏలూరు 12 పంపుల సెంటరులో..

నగరంపై వరుణ ప్రకోపం

వేసవి కాలం ముగిసిన తరువాత వర్షాలు పడి వాతావరణం చల్లబడడంతో ఈ నెల ఆరంభంలో ప్రజలకు ఊరట లభించింది. రుతుపవనాల ప్రభావంతో 15 రోజుల కిందట కొద్దిగా వర్షాలు పడ్డాయి. గత మూడు నాలుగు రోజులుగా నగరంపై కుండపోత వాన పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత 24 గంటల్లో వర్షం ఆగకుండా కురుస్తూనే ఉండడంతో ప్రజలు తమ దినసరి పనులకు ఆటంకం ఏర్పడింది. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యార్థులు, ఉద్యోగులు వర్షాల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితిలో బయటకు రావాల్సిన వారు గొడుగులను ఆశ్రయిస్తున్నారు. రెయిన్ కోట్లు ధరించి వారి పనులు చేసుకుంటున్నారు. భవన నిర్మాణ కార్మికుల పనులకు బ్రేక్ పడింది. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీలు పొంగి వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

– ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)/ఫొటో గ్రాఫర్ ఏలూరు



వర్షంలో వృద్ధుడి కష్టాలు



వర్షపు నీటితో నిండిపోయిన స్నేహవారధి

నిస్వార్థ సేవలకు.. వలంటీర్లు



ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన వలంటీర్ వ్యవస్థ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తోంది. ప్రజలకు జవాబుదారీతనం, ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు పని చేస్తున్నాయి. వలంటీర్లు అర్హుల ఇంటివద్దనే పథకం లబ్ధికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. ఒకవేళ పథకం రాదంటే దానికి కారణాలు ఏమిటో కూడా స్పష్టంగా చెబుతున్నారు. ఇలాంటి బృహత్తరమైన పనులు చేస్తోన్న వలంటీర్లపై జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ చేసిన ఆరోపణలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఏలూరులోని సచివాలయ భవనం (ఫైల్)

రాజకీయాలకు అతీతం



సీఎం జగన్ రాజకీయాలకు అతీతంగా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఉత్తమ సేవలు అందిస్తున్నారు. మా వలంటీర్ రాజ్యలక్ష్మి పథకాలు అన్నీ మంచిగా అందేలా చూస్తుంది. నాకు చేదోడు పథకం వస్తోంది. జగనన్న కాలనీలో ఇంటిస్థలం మంజూరయింది. డ్వాక్రా రుణమాఫీ, నా భర్తకు వికలాంగుల పింఛన్ కూడా వస్తోంది. నా కుమారుడికి జగనన్న విద్యాదీవెన, మా కుమార్తెకు అమ్మఒడి పథకాలు వస్తున్నాయి. కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలు మరువలేం.

– యెలగా పుష్ప, ఏఎస్ కాలనీ, ఏలూరు

వలంటీర్ల సేవలు బాగున్నాయి



జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ అద్భుతం. మా వలంటీర్ రమాదేవి మాతో చక్కగా కలిసిపోయి ప్రభుత్వ పరంగా మాకు రావాల్సిన పథకాలు వచ్చేలా చేస్తుంది. మాకు జగనన్న కాలనీలో ఇల్లు మంజూరయింది. ఇంటి నిర్మాణం ప్రారంభించారు. డ్వాక్రా రుణమాఫీ వచ్చింది. మా అత్తగారికి చేయూత, మా మామగారికి పింఛన్ వస్తున్నాయి. పిల్లలకు చదువుకు దోహదపడుతూ అమ్మఒడి పథకంలో నగదు జమ చేస్తున్నారు. గతంలో రేషన్‌కు వెళితే చాలా ఇబ్బంది పెట్టేవారు. నేడు ఇంటి సమీపంలోనే రేషన్ తీసుకుంటున్నాం. కరోనా సమయంలో వలంటీర్ల సేవలు అభినందనీయం.

– సుగ్గు సుబ్బలక్ష్మి, 15వ డివిజన్, ఏలూరు

విమర్శలు మానుకోవాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా అందించాలనే ఉన్నత లక్ష్యంతో వలంటీర్ వ్యవస్థను రూపొందించింది. ఈ నాలుగేళ్లుగా వలంటీర్లు మాకు ఉత్తమ సేవలు అందించారు. మా వలంటీర్ దేవి ప్రభుత్వ పరంగా మాకు రావాల్సిన అన్ని పథకాలకూ దరఖాస్తు చేస్తుంది. మా మధ్య తిరిగే పిల్లలను పవన్‌కళ్యాణ్ రాజకీయంగా విమర్శించటం సరికాదు. నాకు మూడేళ్లుగా వాహనమిత్ర పథకం వస్తోంది. ఇంట్లో వాళ్లకు ఇతర పథకాలు అందుతున్నాయి. ఏమీ చేయలేని వాళ్లంతా ప్రభుత్వంపైనా, వలంటీర్లపైనా రాజకీయ ఆరోపణలు చేయటం దారుణం. నీచమైన మాటలు మానుకోవాలి.

– సయ్యద్ ఖాసిం, వైఎస్సార్ కాలనీ, ఏలూరు

మంచి చేస్తున్నారు



సీఎం జగనన్న అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందాలంటే వలంటీర్ వ్యవస్థ కీలకంగా ఉంది. జగనన్న అమలు చేసే నవరత్నాలతో ప్రజల్లో ఆయనకు మంచి పేరు వస్తుందనే బాధతోనే పవన్‌కళ్యాణ్ వంటివాళ్లు వలంటీర్ల మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మా వలంటీర్ సునీత మా ప్రాంతంలో ప్రభుత్వ పరంగా పథకాలకు దరఖాస్తు చేస్తుంది. నాకు మూడేళ్లుగా చేయూత పథకం అందుతోంది. మా చుట్టూ తిరిగే ఆడపిల్లలే వలంటీర్లుగా పని చేస్తున్నారు. వాళ్లంతా ఏ విధంగా మహిళలు, బాలికల వివరాలను ఇతరులకు ఇస్తారు?. ఏమీ తెలుసుకోకుండా పవన్ కళ్యాణ్ ఆరోపణలు చేయటం సిగ్గుచేటు.

– షేక్ రెహానా, 13వ డివిజన్, ఏలూరు

కొల్లేరులోకి వరద నీరు



శనివారపుపేట కాజ్‌వే మీదుగా కొల్లేరులోకి పారుతున్న తమ్మిలేరు వరదనీరు

ఏలూరు రూరల్: కొల్లేరులోకి వరదనీరు చేరుతోంది. బుధవారం తమ్మిలేరు గుండా ఏలూరుకు చేరుతున్న వరదనీరు తూర్పులాకులు, పడమట లాకుల మీదుగా కృష్ణా కాలువలోకి వచ్చి కలుస్తోంది. ఇరిగేషన్ అధికారులు తూర్పు, పడమటి లాకుల గేట్లు కొద్దిగా ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. తద్వారా వరద నీరు కొల్లేరుకు పారుతోంది. తమ్మిలేరు ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఏడు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాత పేర్కొన్నారు. పోణంగిలో 3, చాటపర్రు, తంగెళ్లమూడి, మొండికోడు, ప్రత్తికోళ్లలంకలో ఒక్కొక్కటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆగస్టు ఒకటో తేదీన దరఖాస్తుల పరిశీలన, 2న అభ్యర్థులకు మౌఖిక పరీక్ష, 3న ఎంపికైన వారి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. నాలుగో తేదీన శిక్షణ, ఐదో తేదీ నుంచి వలంటీర్లు విధులకు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు.

వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకొనేందుకు స్కూల్ కాంప్లెక్స్‌లు దోహద పడతాయని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ అన్నారు. స్థానిక సత్రంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహిస్తోన్న ప్రాథమిక పాఠశాల స్కూల్ కాంప్లెక్స్, భౌతిక శాస్త్రం సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశాలను బుధవారం మధ్యాహ్నం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్స్‌ను, స్మార్ట్ టీవీలను సక్రమంగా వినియోగించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదిగేందుకు నిరంతరం తమ అనుభవాలను తోటి ఉపాధ్యాయులతో పంచుకోవాలన్నారు. సందేహాలను సహచర ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకున్నప్పుడే మంచి నైపుణ్యాలను సాధిస్తారని చెప్పారు. ప్రతి నెలా జరిగే కాంప్లెక్స్‌లో బోధన అభ్యసన ప్రక్రియ సాధనకు ఉపాధ్యాయులు ఎక్కువ సమయాన్ని కేటాయించి తమ బోధన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు మరింత సమర్థవంతంగా బోధన చేయాలని కోరారు. వచ్చే నెలలో సీబీఏ పద్ధతిలో నిర్వహించబోయే ఫార్మేటివ్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. వర్షంగా ఉన్నప్పటికీ సమావేశాలు క్రమశిక్షణతో నిర్వహిస్తున్నందుకు ఉపాధ్యాయులను, కాంప్లెక్స్ చైర్‌పర్సన్ ఆర్ శైలజను ప్రత్యేకంగా అభినందించారు.



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ శ్యామ్‌సుందర్

పండ్లు, ప్రోటీన్ స్వీట్లు పంపిణీ

ఏలూరు టౌన్: సమాజంలో ఆదరణలేని వారికి అండగా నిలబడాలని, తమవంతు సహాయం చేయాలని ఏలూరు ఏడో డివిజన్ కార్పొరేటర్, లయన్స్ క్లబ్ సభ్యులు పిల్లంగోళ్ల శ్రీదేవి తెలిపారు. ఏలూరు జీజీహెచ్‌లో తలసేమియా భవన్‌లో బుధవారం రక్తమార్పిడి చికిత్స చేయించుకున్న తలసేమియా చిన్నారులను శ్రీదేవి పరామర్శించారు. వారికి ప్రోటీన్లతో కూడిన స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అందజేసే ఉచిత భోజనాన్ని చిన్నారులు, వారి సహాయకులకు వడ్డించారు. రెడ్‌క్రాస్ సొసైటీ నిత్యం పేదలకు సేవలు అందిస్తోందని చెప్పారు. ఏలూరులోని విజయ వృద్ధుల ఆశ్రమాన్ని శ్రీదేవి సందర్శించారు. భారీ వర్షాల నేపథ్యంలో వృద్ధుల ఆరోగ్యస్థితిని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు అండగా ఉండాలని, వారి బాగోగులు మంచిగా చూసుకోవాలని నిర్వాహకులను కోరారు. వృద్ధులకు పండ్లు, పౌష్టికాహారం అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు పద్మ, మానవత కృష్ణారావు, డాక్టర్ వరప్రసాద్ తదితరులు ఉన్నారు.



చిన్నారికి స్వీట్లు, పండ్లు పంచుతున్న శ్రీదేవి

రహదారి అభివృద్ధికి నిధులు

పెదపాడు: రహదారి అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలం గుడిపాడు గ్రామ పంచాయతీలోని ఎస్సీ ఏరియాకు వెళ్లే రహదారిని ఆమె పరిశీలించారు. ఈ రహదారి దుస్థితిని స్థానిక నాయకులు వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల ప్రభాకరరావు తన దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె పరిశీలించారు. 500 మీటర్ల మేర రహదారి అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, సొంగల మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	28

ముంపు బాధితులను ఆదుకుంటాం

జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: ముంపు బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని విధాలా అండగా ఉన్నారని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు మండలం సత్యవోలు, కడిమికుంట గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగిన పంట పొలాలను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని సాగు భూమి 16 వేల ఎకరాల్లోని ఎనిమిది వేల ఎకరాల్లో రైతులు వరి నాట్లు పూర్తి చేశారని తెలిపారు. వారం రోజులుగా కురుస్తోన్న వర్షాలతో సుమారుగా 1,500 ఎకరాల్లో నాట్లు వేసిన పొలాలు నీట మునిగాయని, ఒక్కో ఎకరానికి రూ.15,000 రైతులు నష్టపోయారని, బాధితులు ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దెందులూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏలూరు జిల్లా రైస్ మిల్లర్ల అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ నష్ట పోయిన రైతులకు మేలుజాతి విత్తనాలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం రైతులకు సకాలంలో ఇన్ పుట్ సబ్సిడీ అందిస్తుందన్నారు.



కడిమికుంటలో నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

చిన్నారికి పరామర్శ

పెదపాడు : మండలంలోని సత్యవోలులో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న పాలవలస మోక్షిత సాయిని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ పరామర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల చిన్నారి పరిస్థితి బాగాలేదని తెలియజేయడంతో వెంటనే సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆపరేషన్‌కు అయిన ఖర్చుకు ఎల్‌ఓసీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అందజేశారు. బుధవారం జెడ్పీచైర్‌పర్సన్‌తో పాటు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి చిన్నారిని పరామర్శించి, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు.